# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 127 | పేజీలు : 08 | గురువారం | 14-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




2

## అధికారం పోయినా జ్ఞానోదయం కలగలేదు

- అధికారం పోయినా ఉదయనిధికి జ్ఞానోదయం కలగలేదు: రఘునందన్ రావు
- అసెంబ్లీలో మరోసారి సనాతన ధర్మం గురించి మాట్లాడిన ఉదయనిధి
- ఉదయనిధి అనుచిత వ్యాఖ్యల వల్లే డీఎంకేని ప్రజలు ఓడించారన్న రఘునందన్
- సనాతన ధర్మాన్ని విమర్శించడాన్ని మానుకోవాలని హితవు



2

## తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే

ప్రధాని అయినా, కేంద్ర మంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే: మంత్రి సీతక్క..

హైదరాబాద్ పల్స్,మహబూబాబాద్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు. భగీరథ్ కేసులో కాంగ్రెస్

## లుకౌట్ నోటీసులు జారీ చేయాలి

- బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేయాలన్న కవిత
- కుమారుడి నేరం రుజువైతే బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలన్న కవిత
- మోదీతో బండి సంజయ్ వేదికను పంచుకోవడం తప్పుడు సంకేతాలు పంపిందని వ్యాఖ్య
- తెలంగాణలో రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకే తమ పార్టీ పుట్టిందన్న కవిత



## రైతులకు గుడ్ న్యూస్

పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం

- ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
- రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు
- క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర



2

# తెలంగాణలో ఉబెర్ భారీ విస్తరణ..

సీఎం రేవంత్‌తో సీఈవో భేటీలో కీలక చర్చలు



2

- సీఎం రేవంత్ రెడ్డితో ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ
- హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణకు ఉబెర్ నిర్ణయం
- పార్కింగ్ రంగంలోకి రావాలని ఉబెర్‌కు సీఎం రేవంత్ సూచన
- భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుపై ఉబెర్ ఆసక్తి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబెర్ తెలంగాణలో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో కంపెనీ విస్తరణ, నగరాల్లో పార్కింగ్ సమస్యలు, రాబోయే భారత్ ఫ్యూచర్ సిటీలో అవకాశాలపై కీలక చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను విస్తరిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎంకు దారా ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన మొట్టమొదటి సీఓఈ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని, భవిష్యత్తులో దీనిని మరింతగా పెంచనున్నామని వివరించారు. ఈ సందర్భంగా నగరాల్లో, ముఖ్యంగా మెట్రో స్టేషన్ల వద్ద ఎదురవుతున్న పార్కింగ్ ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి

## ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!

- విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం
- చర్చ సందర్భంగా ప్రభుత్వం మనుగడపై ఉదయనిధి అనుమానాలు
- ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలుపశ్చాత్తాపపడుతున్నారని వ్యాఖ్య



2

## రాసి పెట్టుకోండి..

ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం

- చలో మామిళ్లపల్లి కార్యక్రమంలో ధూళిపాళ్లపై అంబటి ఫైర్
- రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడి చేయించడం ఏమిటని ప్రశ్న
- లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శ



2

## అమెరికా 51వ రాష్ట్రంగా వెనెజువెలా...

ట్రంప్ పోస్టుతో దుమారం

- ట్రంప్ పోస్టును ఖండించిన వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్
- ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మార్కో రుబియో ప్రయాణిస్తున్నట్లు పోస్టు
- చైనా అధ్యక్షుడితో సమావేశానికి ముందు పోస్టుపై చర్చ



2

## సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల

పాస్ పర్సెంటేజీ పడిపోయింది!



2

- సీబీఎస్ఈ 12వ తరగతి 2026 ఫలితాలు విడుదల
- గతేడాదితో పోలిస్తే 3 శాతం తగ్గిన ఉత్తీర్ణత
- ఈసారి కూడా అబ్బాయిలపై బాలికలదే పైచేయి
- తిరువనంతపురం రీజియన్‌లో అత్యధిక పాస్ శాతం నమోదు
- కంపార్ట్‌మెంట్ విద్యార్థుల సంఖ్యలో స్వల్ప పెరుగుదల

## విచారణకు హాజరు కాలేకపోతున్నాను

పోలీసులకు బండి భగీరథ్ లేఖ

- వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోతున్నట్లు వెల్లడి
- విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు మరో రెండు రోజులు కావాలని విజ్ఞప్తి
- దర్యాప్తుకు సహకరిస్తానన్న బండి భగీరథ్
- విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని కేటాయించాలని విజ్ఞప్తి

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను హాజరుకాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు రెండు రోజుల గడువు కావాలని పోలీసులకు లేఖ రాశాడు.

## ఇది కొత్త రియాలిటీ... దీన్ని ప్రోత్సహిద్దాం

- వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపు
- పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని 8 సూచనలను పాటిద్దామన్న ముఖ్యమంత్రి
- పెట్రోల్ వాడకం, విదేశీ పర్యటనలు తగ్గించుకుని దుబారాకు అడ్డుకట్ట వేయాలని సూచన
- అమరావతిలో బైసర్ ఇనిస్టిట్యూట్, కిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- క్వాంటమ్ వ్యాలీతో అమరావతి నుంచి ప్రపంచానికి కంప్యూటర్లు అందిస్తామన్న సీఎం

2



హైదరాబాద్ పల్స్,అమరావతి

ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తోందని, ఈ నూతన వాస్తవికతను అందరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోనూ భవిష్యత్తులో ఈ తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమ ఆసియాలో యుద్ధ

# ఇది కొత్త రియాలిటీ... దీన్ని ప్రోత్సహిద్దాం

మొదటి పేజీ తరువాయి

వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జాతికి ఇచ్చిన 8 పొదుపు సూచనలను రాష్ట్ర ప్రజలందరూ పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండి ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అమరావతిలోని నిడమర్రులో బుధవారం బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బైసర్) శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని సూచనల మేరకు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని చంద్రబాబు అన్నారు. "దేశం మొత్తం దుబారాను తగ్గించాలి. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ప్రజాప్రతినిధులు కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ఆదర్శంగా నిలవాలి. భద్రతను కూడా కుదించుకోవాలి" అని ఆయన హితవు పలికారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, బంగారం కొనుగోళ్లపై కూడా ప్రజలు ఆలోచించాలని సూచించారు. మన దేశంలో, రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని, విదేశాలకు బదులు స్వదేశీ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఎంతో అందమైనవని, సూర్యలంకను గోవాను మించిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. "నా దేశం – నా బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు.

**అమరావతికి వైద్య, విద్య హబ్ గుర్తింపు**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులన్నీ ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత తమదని, పారిశ్రామికవేత్తలు వేగంగా నిర్మాణాలు పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ తిరుగులేని శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. "ప్రపంచంలోని ప్రతి ముగ్గురు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిలో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలి," అని ఆయన తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. బైసర్, కిమ్స్ సంస్థలు ఈ లక్ష్య సాధనకు దోహదపడతాయన్నారు. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించేలా ఈ సంస్థలు విస్తరించనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది ఇదే రోజున కిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు.

**క్వాంటమ్ వ్యాలీతో కొత్త శకం**

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రాబోతోందని, ఇది దేశంలోనే ఒక నూతన అధ్యాయమని చంద్రబాబు అన్నారు. "ఈ ఏడాది డిసెంబర్ నాటికి మన దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటర్‌కు ఏపీ చిరునామాగా మారుతుంది. రెండేళ్లలో అమరావతి నుంచి ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లు సరఫరా చేస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ ప్రాజెక్టులతో రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, తన జీవితంలో అలాంటి అరాచక పాలనను చూడలేదని విమర్శించారు. తన ప్రభుత్వ లక్ష్యం పిల్లల భవిష్యత్తు, యువతకు ఉద్యోగాలేనని స్పష్టం చేశారు. గత పాలకులు ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ భారం మోపారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచలేదని, భవిష్యత్తులో కూడా పెంచబోమని హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. అమరావతిని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని, విశాఖను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్, టెక్నాలజీ హబ్‌గా మారుస్తామని, 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 24 లక్షల ఉద్యోగాలు సృష్టించే లక్ష్యంతో పనిచేస్తున్నామని చంద్రబాబు వివరించారు.

# రాసి పెట్టుకోండి..

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని మామిళ్లపల్లి ఘటన ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. మొక్కజొన్న రైతులపై దాడులు జరిగాయని, అక్రమ కేసులు పెట్టారంటూ వైసీపీ చేపట్టిన 'చలో మామిళ్లపల్లి' కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు... ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై విరుచుకుపడ్డారు. రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడులు చేయించడం ఏంటని అంబటి ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తారా అంటూ మండిపడ్డారు. "వచ్చే ఎన్నికల్లో ధూళిపాళ్ల నరేంద్ర ఓడిపోవడం ఖాయం, ఇది రాసుకోండి" అంటూ మూడేళ్ల ముందే ఆయన జోస్యం చెప్పారు. రైతుల కాలి ధూళికి ఆయన కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు. మా కుటుంబంపై, మా కులంపై , మా పార్టీపై కక్ష కట్టి ఇలాంటి దాడులు చేస్తున్నారా అని అంబటి నిలదీశారు. గుంటూరు ఐజీ త్రిపాఠి ఖాకీ డ్రెస్ వేసుకోవడం లేదని, పచ్చ డ్రెస్ (టీడీపీ రంగు) వేసుకుంటున్నారని ఆరోపించారు. లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శించారు. తప్పు చేస్తే ఎంతటి పెద్ద అధికారినైనా చట్టప్రకారం శిక్షిస్తామని, తప్పుడు కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గోడౌన్‌లో సీజ్ చేసిన మొక్కజొన్నను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టులకు భయపడేది లేదని, అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.



## లుకౌట్ నోటీసులు
# జారీ చేయాలి

మొదటి పేజీ తరువాయి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. పోక్సో కేసులో ఉన్న బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా పోలీసులు వెంటనే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ నేరం రుజువైతే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా బండి సంజయ్ ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకోవడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిందని ఆమె అభిప్రాయపడ్డారు. బాధితురాలి జీవితాన్ని దెబ్బతీసేలా వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని, ఆ అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరారుపాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని కవిత అన్నారు. ఇప్పటివరకు ఆయన ఈ ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ఏమిటని ఆమె ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం నీటి వనరుల వినియోగంలో విఫలమవుతోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాడతామని కవిత తెలిపారు. నీట్ పేపర్ లీక్ గురించి ఆమె మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే తమ పార్టీ పుట్టిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!

మొదటి పేజీ తరువాయి

తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో స్పష్టమైన మెజారిటీతో విజయ్ ప్రభుత్వం నెగ్గింది. విశ్వాస పరీక్షకు ఓటింగ్ సందర్భంగా డీఎంకే సభ నుంచి వాకౌట్ చేసింది. విశ్వాస పరీక్ష సందర్భంగా ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వాన్ని ఉద్దేశించి, ఈ ప్రభుత్వం ఎంతకాలం మనుగడ సాగిస్తుందోనని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంతకాలం మనుగడ సాగిస్తుందో తెలియని ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. తమిళనాడులో లౌకికవాద ప్రభుత్వమే ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 65 శాతం మంది ఓటర్లు ముఖ్యమంత్రి విజయ్, టీవీకేను తిరస్కరించారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చారని, కనీసం ఇప్పుడైనా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే రీతిలో పనిచేయాలని సూచించారు. ఎందుకంటే మీకు ఓటు వేసిన ప్రజలే ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందోనని ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్త ప్రభుత్వానికి సూచించారు. విశ్వాస ఓటింగ్‌లో తమ పార్టీ పాల్గొనడం లేదని, డీఎంకే ఎమ్మెల్యేలం వాకౌట్ చేస్తున్నామని ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. డీఎంకేతో పాటు మిత్రపక్షమైన ఎంఎంకే కూడా విశ్వాస పరీక్షను వ్యతిరేకించింది. మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆ పార్టీ నాయకుడు జవహిరుల్లా ప్రస్తావించారు. డీఎంకే మరో మిత్రపక్షం ఎండీకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించాయి. ఏఎంఎంకే పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ కూడా ప్రభుత్వానికి మద్దతు పలికారు. దీంతో ఆయనను ఏఎంఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు.

# సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 2026 సంవత్సరానికి గాను 12వ తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం ఉత్తీర్ణత శాతం 85.20గా నమోదైంది. గతేడాది నమోదైన 88.39 శాతంతో పోలిస్తే ఇది సుమారు 3 శాతం తగ్గడం గమనార్హం. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 17,68,968 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎప్పటిలాగే, ఈసారి కూడా ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. బాలికల ఉత్తీర్ణత శాతం 88.86గా ఉండగా, బాలుర ఉత్తీర్ణత శాతం 82.13గా నమోదైంది. అబ్బాయిల కంటే అమ్మాయిలు 6.73 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. ప్రాంతాల వారీగా చూస్తే, కేరళలోని తిరువనంతపురం 95.62 శాతం ఉత్తీర్ణతతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ రీజియన్ 72.43 శాతంతో చివరి స్థానంలో ఉంది. ఈసారి సుమారు 1,63,000 మంది విద్యార్థులు కంపార్ట్‌మెంట్ (సప్లిమెంటరీ) కేటగిరీలో ఉన్నారు. ఈ సంఖ్య గతేడాదితో పోలిస్తే 2 శాతానికి పెరిగింది. మరోవైపు, 94,000 మందికి పైగా విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించగా, 17,000 మందికి పైగా 95 శాతానికి పైగా స్కోర్ చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను సీబీఎస్ఈ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. మార్క్‌షీట్లు కూడా అందుబాటులో ఉంచినట్లు బోర్డు తెలిపింది.

# రైతులకు గుడ్ న్యూస్

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి కొత్త ధరలను ఖరారు చేశారు. వరి క్వింటాల్‌కు రూ. 2,441 గా నిర్ణయించారు. గ్రేడ్-ఏ వరి క్వింటాల్‌కు రూ. 2,461 గా మద్దతు ధరను ఖరారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ మద్దతు ధర కోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం విశేషం. వ్యవసాయంతో పాటు రవాణా, ఇంధన రంగాలకు కూడా కేంద్ర కేబినెట్ పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇంధన భద్రత కోసం ఈ పథకానికి రూ. 37,500 కోట్లు కేటాయించారు. సర్కేజీ - ధోలేరా మధ్య సెమీ హై స్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ. 20,065 కోట్లు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# అధికారం పోయినా జ్ఞానోదయం కలగలేదు

మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీలో ప్రసంగించిన డీఎంకే నేత, మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, తన పాత వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. మనుషుల మధ్య దూరాన్ని పెంచి, విభజన తెచ్చే సనాతన ధర్మాన్ని అంతం చేయాలన్న తన నినాదాన్ని ఆయన మళ్లీ లేవనెత్తారు. అయితే, ఇదే సమయంలో ఆయన రాజకీయ పరిణతిని కూడా ప్రదర్శించారు. కొత్త ముఖ్యమంత్రి విజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూనే, సభలో అధికార, ప్రతిపక్షాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ తమిళనాడు అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని, సభలో రాజకీయ మర్యాదలు కొనసాగాలని కోరారు. మరోవైపు సనాతన ధర్మాన్ని అంతం చేయాలన్న ఉదయనిధిపై తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. అధికారం కోల్పోయినా ఉదయనిధికి జ్ఞానోదయం కలగలేదు అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మంపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యల వల్లే ప్రజలు డీఎంకేని తిరస్కరించారని రఘునందన్ గుర్తుచేశారు. అందరి మంచిని కోరుకునే ధర్మమే సనాతన ధర్మమని చెప్పారు. సర్వజనుల శ్రేయస్సును కోరే సనాతన ధర్మాన్ని విమర్శించడం మానుకోవాలని, హిందూ సంప్రదాయాలను గౌరవించాలని ఆయన హితవు పలికారు. భవిష్యత్తులో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఉదయనిధికి సూచించారు. రఘునందన్ రావు ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఉదయనిధిపై విమర్శలు గుప్పించారు.

## విచారణకు హాజరు
# కాలేకపోతున్నాను

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపించాడు. మే 8వ తేదీన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నిన్న నోటీసులు జారీ చేశారు. అయితే, తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా ఆధారాలు, సమాచారం సేకరించేందుకు సమయం కావాలని భగీరథ్ పోలీసులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని ఆయన స్పష్టం చేశారు. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని సూచించాలని కోరారు. మరోవైపు, ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కఠినమైన పోక్సో సెక్షన్ 5(1), 6ను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే 20 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో దర్యాప్తు వేగవంతమైంది. ఇదిలా ఉండగా, భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని బాధితురాలి కుటుంబంపై భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# అమెరికా 51వ రాష్ట్రంగా వెనెజువెలా...

మొదటి పేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం వెనెజువెలాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా పేర్కొంటూ ఒక గ్రాఫిక్ ఫొటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఈ పోస్టు తీవ్ర దుమారం రేపింది. ట్రంప్ పోస్టును వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ తీవ్రంగా ఖండించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సమయంలో ఆయన నైట్ ట్రాక్ సూట్‌ను ధరించారు. ఆ సూట్‌ను పోలిన ట్రాక్ సూట్‌ను ధరించి, ఎయిర్ ఫోర్స్ వన్‌లో విమానంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రయాణిస్తున్నట్లు కూడా ఈ పోస్టు ఉంది. డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యేందుకు చైనాకు వెళ్లనున్న సమయంలో, సామాజిక మాధ్యమంలో ఈ పోస్టు పెట్టడం చర్చకు దారి తీసింది. వైట్ హౌస్ కూడా ఈ ఫొటోలను తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. వెనెజువెలాను తమ దేశంలోని కొత్త రాష్ట్రంగా పరిగణించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ పేర్కొన్నారు.

# తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణలో ఉబెర్
# భారీ విస్తరణ.

మొదటి పేజీ తరువాయి

ప్రస్తావించారు. ఈవీ ఛార్జింగ్ స్టేషన్లతో కూడిన మల్టీ-లెవల్ పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉబెర్‌కు సూచించారు. పట్టణ రద్దీని తగ్గించేందుకు పార్కింగ్ నిర్వహణ రంగంలోకి ప్రవేశించే అవకాశాలపై అధ్యయనం చేయాలని కోరారు. సీఎం ప్రతిపాదనపై ఉబెర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 30,000 ఎకరాల భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి సీఎం వారికి వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపిన దారా ఖోస్రోషాహి, అక్కడ తమ కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ భవిష్యత్ విస్తరణకు ప్రభుత్వ సహకారం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, సీటీఓ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారం రోజుల భారత పర్యటనలో భాగంగా ఖోస్రోషాహి పలువురు కేంద్ర, రాష్ట్ర నాయకులతో మొబిలిటీ, టెక్నాలజీ, పెట్టుబడులపై చర్చిస్తున్నారు. కాగా, పార్కింగ్ ప్రాజెక్టులు, కొత్త కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితులను ప్రకటించనప్పటికీ, తెలంగాణలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

# దైవ స్వరూపిణి అనసూయ మాత..!



- వైభవంగా దివ్య సంస్మరణ సభ
- ఆలయ నమూనా ఆవిష్కరణ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, జహీరాబాద్ :** గత ఆరు దశాబ్దాలుగా భక్తులకు సేవలు అందిస్తూ, "మానవ సేవే మాధవ సేవ" అనే ధ్యేయంతో జీవితాన్ని త్యాగం చేసిన బర్దిపూర్ మాతృమూర్తి అనసూయ మాత దైవ స్వరూపిణి అని వివిధ ఆశ్రమాల మఠాధిపతులు, పీఠాధిపతులు కొనియాడారు. బుధవారం బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో అనసూయ మాత దివ్య సంస్మరణ సభను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం అనసూయ మాత ఆనంద నిలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా రుద్రాభిషేకం, మంగళ హారతి ఘనంగా చేశారు. అనంతరం ఆలయం వద్ద పాదుకలను ప్రతిష్టించి మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పించారు. అమ్మవారి దివ్య సభ ధర్మసభలో వివిధ ప్రాంతాల పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్, సంగ్రామ్ మహారాజ్, వీరేశ్వర శివాచార్య, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉజువల్ రెడ్డి అమ్మవారిని తదితరులు పాల్గొన్నారు. సభలో వక్తలు మాట్లాడుతూ... అనసూయ మాత తన జీవితమంతా పేదలకు విద్యాదానం, వృద్ధాశ్రమం, ఉచిత వైద్య సేవ, ప్రభుత్వ ఆసుపత్రికి ఉచితంగా స్థలం, నిత్యం అన్నదానం, భక్తులకు సేవ, ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తూ ఒక తల్లిలా అందరికీ అండగా నిలిచారని తెలిపారు.



భక్తులను ధర్మం వైపు నడిపిస్తూ సంప్రదాయాల నిలుపుదలకు అమ్మవారు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. అమ్మవారి ఆశయాలను కొనసాగిస్తూ భక్తులకు మరింత సేవలందిస్తామని ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. బర్దిపూర్ దత్తగిరి ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## పాడి రైతులకు చెక్కులు అందజేసిన

# ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఎన్.డి.డి.బి. ఒప్పందం తో పాడి రైతులకు రూ.10 కోట్ల ఆర్థిక సహాయన్నీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చెక్కులు పంపిణీ అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మదర్ డెయిరీ పాల కేంద్రంలో పాడి రైతుల సంక్షేమం మరియు పాల ఉత్పత్తి అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్.డి.డి.బి.) ద్వారా మంజూరైన రూ.10 కోట్ల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో పాడి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా పాడి రైతుల అభివృద్ధి కోసం మదర్ డెయిరీ, ఎన్.డి.డి.బి. సంస్థల సహకారంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పాడి పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదని, రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఎన్.డి.డి.బి. ద్వారా అందించిన ఈ నిధులు పాల ఉత్పత్తి పెంపు, పశు సంవర్ధక అభివృద్ధి, రైతులకు ఆధునిక సౌకర్యాల కల్పనకు



ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు నాణ్యమైన పాల ఉత్పత్తి చేసి మరింత ఆదాయం పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ అధికారులు, ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు

# మహిళా కానిస్టేబుల్ ను పెళ్లి పేరుతో మోసం...

## కొల్లూరు ఎస్.ఐ సురేష్ సస్పెండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, మెయిన్ డెస్క్:** ప్రేమిస్తున్నాను అంటూ నమ్మించి.. పెళ్లి పేరుతో కాలయాపన చేస్తూ తప్పించుకు తిరుగుతున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్ కుమార్ ను సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతిని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు కేసు నమోదు కావటంతో.. ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ఉన్నతాధికారులు. పూర్తి వివరాల్లోకి వెళితే..**

2018 బ్యాచ్ ఎస్సై సురేష్ కుమార్.. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతితో పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పటంతో.. ఎస్సై సురేష్ కు దగ్గరైంది ఆ మహిళా కానిస్టేబుల్. కొన్నాళ్లుగా పెళ్లి విషయంపై ఒత్తిడి చేస్తుంది మహిళా కానిస్టేబుల్. సాకులు చెబుతూ.. పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నారు ఎస్సై సురేష్ కుమార్. పెళ్లి వాయిదాపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వెంటనే పెళ్లి చేసుకోవాలని మహిళా కానిస్టేబుల్ పట్టుబట్టింది. పెళ్లి విషయంలో ఎస్సై సురేష్ కుమార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటంతో.. మహిళా కానిస్టేబుల్ గట్టిగా నిలదీసింది. పెళ్లి చేసుకునేది లేదని.. పెళ్లి చేసుకోవటం కుదరదు అని తేల్చి చెప్పారు ఎస్సై సురేష్. ఈ క్రమంలోనే ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసినట్లు కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ చేసింది మహిళా కానిస్టేబుల్. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎస్సై సురేష్ ను విచారించేందుకు ప్రయత్నించారు. అతని సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ లో




ఉండటంతో.. విచారణకు స్పందించకపోవటం.. అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో.. ఎస్సై సురేష్ కుమార్ ను సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. బాధితురాలు మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఆధారాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## మార్నింగ్ వాక్ ద్వారా

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం....బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని 9వ, 10వ, 12వ వార్డుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తూ ఉదయం 6 గంటల నుంచే ఆయా వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పారిశుధ్యం, తాగునీటి వంటి సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ముందుగా డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేసి, అనంతరం సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులతో పాటు గుత్తేదారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,



ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, మార్నింగ్ వాక్ కార్యక్రమం ద్వారా ప్రతి వార్డులో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# జహీరాబాద్ లో విజయ కేర్ ఆసుపత్రి ప్రారంభం

### ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్, ఉజ్వల్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, జహీరాబాద్ టౌన్:** జహీరాబాద్ పట్టణంలోని రాచన్న పెట్ డిసిఎంఎస్ కాంప్లెక్స్ లో కాంగ్రెస్ నాయకుల హుగ్గెల్లి రాములు సోదరుడు అంజన్న కుమార్తె శ్రీ విజయ కేర్ నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సీనియర్ నాయకులు డాక్టర్, సిద్ధం ఉజ్వల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ మొబిన్, మున్సిపల్ చైర్మెన్ యూనస్, కౌన్సిలర్స్ జంగీర్, జాఫర్, జమీల్, అతిక్, అరుణ్, అక్రమ్, నిజాం, శ్రీధర్ రెడ్డి, సీడీసీ డైరెక్టర్ మళ్ళా రెడ్డి, మాజీ ఎంపీపీ గుండు రెడ్డి, ధనసిరి మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, భీమయ్య, మోతీరం, భర్కత్, ముస్తఫా, నరసింహ, నథానియాల్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం తహసీల్దార్ కి వినతి

**నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి**

**ఇందిరమ్మ ఇల్లు ఎంపికలో రాజకీయ జోక్యం తగదు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం నాడు ముట్టడించిన సిపిఎం, తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం బూర్గంపాడు మండల కమిటీ. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయల పెన్షన్ వెంటనే విడుదల చేయాలని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రెండోదఫా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రంగం సిద్ధం చేసినప్పటికీ అధికారుల ఆచరణ కరువైందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం తగదని వ్యాఖ్యానించారు. అదేవిధంగా గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని స్థానిక తహసీల్దార్ కి వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ దరఖాస్తు పరిశీలించి పేదలకు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం బత్తుల వెంకటేశ్వర్లు బూర్గంపాడు మండల సిపిఎం అధ్యక్షతన , తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మచ్చ వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాసుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీడీ ఆకు సేకరణదారులు అప్రమత్తంగా ఉండాలి

### పులి సంచార ప్రాంతాల్లో గుంపులుగా వెళ్లాలని ఎఫ్డీవో అప్పయ్య సూచన




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) రేంజ్ పరిధిలో బీడీ ఆకు సేకరణదారులు వన్యప్రాణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎఫ్డీవో అప్పయ్య సూచించారు. ఆకులు సేకరించేటప్పుడు గుంపులుగా వెళ్లి, మాట్లాడుకుంటూ లేదా చప్పుడు చేస్తూ పని చేయాలని తెలిపారు. ఇటుకలపహాడ్, చీలపల్లి, మాలిని ప్రాంతాల్లో పులి సంచారం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు బీడీ ఆకు కల్లాలను పరిశీలించి సేకరణదారులు, ఇంచార్జ్‌లకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్, సెక్షన్ ఆఫీసర్లు అతారుద్దీన్, మోహన్‌రావు, బీట్ ఆఫీసర్లు లక్ష్మీ, షాహిద్, రవీనా పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు బోరు వేయించే పనులు ప్రారంభించిన : చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణంలోని ఎనిమిదో 8వ వార్డులో గల జంఖానా గూడెం లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ బోరు వేయించే పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక కౌన్సిలర్ తహేరా బబ్లు ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, "ప్రజల మౌలిక సదుపాయాల కల్పనే మా ప్రభుత్వ ధ్యేయం. ఎనిమిదో వార్డులో నీటి ఎద్దడి ఉందని మా దృష్టికి రాగానే వెంటనే స్పందించి బోరు మంజూరు చేయించాం. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీ ఈ కొండలరావు మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, స్థానిక కౌన్సిలర్ తహేరా బబ్లు, బర్రె కరుణాకర్ కాంగ్రెస్ నాయకులు కూర శివకుమార్, నీలం సత్యనారాయణ, ఎండీ షాహెద్, కిట్టు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి : కలెక్టర్ హరిత

### రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు వరి ధాన్యం, మొక్కజొన్నను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. జిల్లాలో 40 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి త్రాగునీరు, గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, మాయిశ్చర్, పాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఐకెపి, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కొనసాగుతోందని, ఇప్పటివరకు 149 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా వెంటనే గోదాములు, రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కాగజ్‌నగర్, కౌటాల, జైనూర్ ప్రాంతాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# టి ఎస్ టి డబ్ల్యూ టి యు నాయకులు రెండు వివాహ వేడుకలకు హాజరు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** తెలంగాణా రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం (టి ఎస్ టి డబ్ల్యూ టి యు) రాష్ట్ర అధ్యక్షుడు గుగ్లోత్ రాములు నాయక్ నేతృత్వంలో సంఘం నాయకులు ఉట్నూర్‌లో జరిగిన రెండు వివాహ వేడుకలకు హాజరయ్యారు. స్టార్ ఫంక్షన్ హాల్‌లో టి ఎస్ టి డబ్ల్యూ టి యు రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ పిఎస్‌హెచ్‌ఎం మడావి లక్ష్మణ్ కుమార్తె వివాహం; చత్రు నాయక్ ఫంక్షన్ హాల్‌లో టి ఎస్ టి డబ్ల్యూ టి యు ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ శివాజి కుమార్తె వివాహం జరిగాయి.రెండు కార్యక్రమాలకు టి ఎస్ టి డబ్ల్యూ టి యు పిజి హెడ్‌మాస్టర్ ఫోరమ్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు పూర్కా ఉద్ధవ్, టి ఎస్ టి డబ్ల్యూ టి యు జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు కోర్వేత మనోహర్, చాహకటి శ్యాంరావ్, జాదవ్ కపిల్ కుమార్, చౌహాన్ నెహ్రూ, పవార్ రవీందర్, జాదవ్ రవీందర్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్యాంగ పిల్లలకు అలింకో సంస్థ సహాయ ఉపకరణాల పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల 184 మంది పిల్లలకు దాదాపు 22 లక్షల రూపాయల విలువైన సహాయ ఉపకరణాలు అందించేందుకు అలింకో సంస్థ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత లతో పాటు హాజరయ్యారు. రెండు నెలల క్రితం జనకాపూర్ భవిత కేంద్రం సందర్శన సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు ఉపకరణాల అవసరాన్ని తన దృష్టికి తీసుకురావడంతో అలింకో సంస్థను సంప్రదించినట్లు కలెక్టర్ వివరించారు. వీల్‌చైర్లు, చంకకర్రలు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, బ్రెయిలీ ప్లేట్లు, కృత్రిమ అవయవాలు వంటి ఉపకరణాలు పంపిణీ చేశారు. దివ్యాంగ పిల్లలపై జాలి మాత్రమే కాకుండా వారికి సమాజంలో సమానంగా జీవించే మనోధైర్యాన్ని కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు



# రైతు సమస్యను ఫోన్‌లో పరిష్కరించిన కలెక్టర్ హరిత

### నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచన




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు తేమశాతం, నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తప్పనిసరిగా కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు సందీప్ తన పొలం వద్దే ధాన్యం కొనుగోలు చేయాలని కోరగా, కలెక్టర్ బుధవారం ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించగా రైతు అంగీకరించినట్లు తెలిపారు. జిల్లాలో రైతుల సౌకర్యార్థం 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గోనె సంచులు, నిల్వ సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

# కౌటాల పశువుల విక్రయశాల, చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఎస్పీ

### అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్పీ నితిక పంత్ కౌటాల పశువుల విక్రయశాలను పరిశీలించి పశువులకు తగిన నీరు, దాణా, గడ్డి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశువుల కొనుగోలు, అమ్మకాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు.అనంతరం సిర్పూర్ టి మండలం పెద్దబండ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. సరైన పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కౌటాల సీఐ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. పిఎసిఎస్ అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారుల నిర్లక్ష్య వైఖరిపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటూ వర్ష సూచన ఉన్నా, కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాలను సకాలంలో తరలించకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి ధాన్యం బస్తాలు ఆరుబయటే ఉండిపోవడంతో తేమ పట్టి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా లారీల ఏర్పాటు మొక్కుబడిగా ఉండటం, లారీల కొరతతో ధాన్యం తరలింపు నిలిచిపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, తమ గోడు పట్టించుకునేవారే లేరని రైతులు ఆరోపిస్తున్నారు. "కష్టపడి పండించిన పంటకు కనీసం గిట్టుబాటు ధర కూడా రాకుండా, ఇప్పుడు తడిసిపోయే పరిస్థితి వచ్చింది. ఇది రైతులను నట్టేట ముంచడమే" అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి, తగినన్ని లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు పిఎసిఎస్ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# విద్యాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి : కలెక్టర్ హరిత

### ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రత్యేక దృష్టి అవసరం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపు కోసం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యా వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, నాణ్యమైన బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. బడి వయసు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, బాలిక విద్యను ప్రోత్సహించడం, దివ్యాంగ పిల్లలకు మద్దతు అందించడం, ప్రతి నెల పాఠశాలలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమయపాలన, విద్యా ప్రమాణాలపై పర్యవేక్షణ అవసరమన్నారు.



# ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను మాసాంతంలోగా పూర్తి చేయాలి

### తహసిల్దార్లు, బీఎల్వోలు ప్రత్యేక దృష్టి సారించాలి
### జిల్లా కలెక్టర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తహసిల్దార్లు, సూపర్వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె మాట్లాడారు.మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలని సూచించారు. మరణించిన లేదా గ్రామం విడిచి వెళ్లిన ఓటర్లను గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు.అనంతరం ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు, గోనె సంచుల లభ్యత, భూభారతి దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీపై సమీక్షించి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# బండి భగీరథపై వెంటనే కేసు నమోదు చేసి నిష్పక్షపాత విచారణ జరపాలి

**చట్టం పేదలకు ఒకలా.. అధికార పార్టీలకు మరోలా ఉండకూడదు.**
**తెలంగాణ ఉద్యమ నాయకుడు కోదాటి వెంకన్న**



**హైదరాబాద్ పల్స్, మే 13, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకులు కోదాటి వెంకన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు, అధికార పార్టీల ద్వంద్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సమస్యలు, పేదల విద్యా వైద్య సమస్యలను పరిష్కరించకుండా ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దేశంలో చట్టం అందరికీ సమానంగా అమలు కావాల్సి ఉండగా, అధికార పార్టీల నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో మాత్రం ప్రత్యేక వైఖరి కనిపిస్తోందని మండిపడ్డారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వచ్చిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, వెంటనే కేసు నమోదు చేసి నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకుంటారని, కానీ అధికారంలో ఉన్నవారి కుటుంబ సభ్యుల విషయంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని ప్రశ్నించారు. మైనర్ బాలికపై జరిగిన ఘటన అత్యంత బాధాకరమని, మహిళల భద్రతపై పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు తమ కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారని నిలదీశారు. రాజకీయ ప్రభావం, అధికార అండతో కేసులను నీరుగార్చే ప్రయత్నాలు జరిగితే ప్రజలు సహించరని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, కేసును వేగవంతంగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజల హక్కుల కోసం, విద్యా వైద్యం కోసం పోరాడిన వారిని ఆపరేషన్ కగార్ పేరుతో అతికిరాతకంగా హతమార్చుతూ, మరోవైపు అధికార కుటుంబాలపై వచ్చిన ఆరోపణలను పట్టించుకోకపోవడం బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకలను అణగదొక్కడం, ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం ప్రమాదకర పరిణామమని అన్నారు. దేశంలో చట్టం, న్యాయం, రాజ్యాంగ వ్యవస్థలు బలహీనపడితే సాధారణ ప్రజలే ఎక్కువగా నష్టపోతారని పేర్కొన్నారు.

# బెంగాల్ సీఎం సువేందు సంచలన నిర్ణయం, మమతా బెనర్జీ 'ఫిక్స్'..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, బెంగాల్ :**
బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాజా ఎన్నికల్లో టీఎంసీ పైన బీజేపీ విజయంలో సువేందు కీలక పాత్ర పోషించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత వరుసగా ఆసక్తి కర నిర్ణయాలతో ముందుకు వెళు తున్నారు. మమత రాజకీయ వ్యూహాల పై పూర్తి అవగాహన ఉన్న సువేందు.. ఆపరేషన్ టీఎంసీ ప్రారంభించారు. అందులో భాగంగా తాజాగా కీలక నిర్ణయాన్ని ప్రకటించారు.బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు మరో కీలక నిర్ణయం వెల్లడించారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో టీఎంసీని బీజేపీ ఊహించని దెబ్బ తీసింది. టీఎంసీతో సహా మమతా బెనర్జీని భవానీపూర్ నుంచి ఓడించారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి మమతను ఓడించిన సువేందు.. తాజా ఎన్నికల్లో భవానీపూర్ లోనూ మమత పై విజయం సాధించారు. ఇక.. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత టీఎంసీ లక్ష్యంగా పలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. కాగా.. ఇప్పుడు నందిగ్రామ్ తో పాటుగా భవానీపూర్ నుంచి గెలిచిన సువేందు అధికారి.. తాను భవానీ పూర్ ఎమ్మెల్యేగా కొనసాగుతానని... నందిగ్రామ్ స్థానం కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా.. గతంలో మమతా గెలిచిన రెండు నియోజకవర్గాల్లో సువేందు గెలిచారు. ఇప్పుడు నందిగ్రామ్ కు రాజీనామా చేయటంతో మమతా ఆ స్థానం పైన ఫోకస్ చేస్తున్నారు.

**సువేందు వ్యూహాత్మక అడుగులు**
కాగా, ఇక్కడే సువేందు కీలక అడుగులు వేస్తున్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. తాను రాజీనామా చేస్తున్న ఈ స్థానం నుంచి గతంలో ఇదే నియోజకవర్గంలో మమత కు మద్దతు దారుడి గా నియోజకవర్గ బాధ్యతలు పర్యవేక్షించిన టీఎంసీ నేతకు బీజేపీ సీటు ఇప్పించేందుకు సువేందు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే.. మమతా ఈ స్థానం నుంచి పోటీకి దిగుతారా.. లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పుడు సువేందు రాజీనామా తో నందిగ్రామ్ కు ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. ఆ ఎన్నిక సువేందు తో సహా మరోసారి మమతకు ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. మమతా అక్కడి గెలిచి అసెంబ్లీకి వెళ్లాలనే ఆలోచనతో ఉన్నారు. సువేందు పూర్తి లెక్కలు సెట్ చేసుకున్న తరువాతనే నందిగ్రామ్ కు రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం అవుతోంది. దీంతో... ఇప్పుడు మమత తదుపరి నిర్ణయాల పైన ఆసక్తి నెలకొంది.

# సరిహద్దుల్లో ముళ్లకంచెలకు భయపడం..

## బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై బంగ్లాదేశ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13 :**
గతంలోలాగా సరిహద్దు సమస్యల విషయంలో బంగ్లాదేశ్ ఇక ఎంతమాత్రం తలవంచబోదని ఆదేశ ప్రధాన మంత్రి తారిఖ్ రెహమాన్ విదేశీ వ్యవహారాల సలహాదారు హుమాయూన్ కబీర్ అన్నారు. సరిహద్దు వెంబడి ముళ్లకంచె నిర్మాణాన్ని వేగవంతం చేస్తామంటూ పశ్చిమ బెంగాల్ కొత్త ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనపై బంగ్లాదేశ్ తాజాగా స్పందించింది."బంగ్లాదేశ్ ప్రజలు, ప్రభుత్వం సరిహద్దుల్లో ముళ్ల తీగలకు భయపడరు. హసీనా హయాంలో ఉన్నట్లుగా సరిహద్దులు ఇకపై ఉండవు. మాకూ సొంత ప్రణాళికలు ఉన్నాయి. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అవసరమైతే భారత్‌తో చర్చలు కూడా జరుపుతాం. భారత అంతర్గత రాజకీయాల్లో మేం జోక్యం చేసుకోబోం. కేంద్రంతో సంబంధాలే మాకు ముఖ్యం" అని హుమాయూన్ కబీర్ వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్‌తో బంగ్లాదేశ్‌కు సుమారు 4,097 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. అందులో 3,240 కిలోమీటర్ల మేర పూర్తవగా.. 850 కి.మీ మేర పెండింగ్‌లో ఉంది. దీన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు బెంగాల్ నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సీఎం సువేందుకు అధికారి తన తొలి కేబినెట్‌లోనే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సరిహద్దు వెంబడి ముళ్లకంచె నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని ప్రకటించారు. అందుకు అవసరమైన భూమిని సరిహద్దు భద్రతా దళానికి అప్పగిస్తామని తెలిపారు. 45 రోజుల్లోనే భూమి బదిలీ పూర్తి చేస్తామని ప్రకటించారు.

## భారత్‌కు చమురు సరఫరాలో

# ఆటంకం రానివ్వం.. రష్యా కీలక హామీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13 :**
పశ్చిమాసియాలో అనిశ్చితి పరిస్థితుల కారణంగా చమురు దిగుమతుల విషయంలో రష్యా కీలక హామీ ఇచ్చింది. రష్యా ఇంధన సరఫరాల్లో భారత్ ప్రయోజనాలకు ఎటువంటి విఘాతం కలగదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ బుధవారం వెల్లడించారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులను తట్టుకుని మరీ భారత్?కు స్థిరంగా ఇంధన సరఫరా చేసేందు రష్యా తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంటుందని పునరుద్ఘాటించారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం నిమిత్తం భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఓ మీడియాతో మాట్లాడిన సెర్గీ లవ్రోవ్ భారత ఇంధన ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తామని, చమరు సరఫరాకు ఆటంకం రానివ్వబోమని హామీ ఇచ్చారు. కాగా దేశంలో ఇంధన వినియోగం తగ్గించాలని స్వయంగా ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేసిన వేళ రష్యా నుంచి ఈ భరోసా మరోసారి రావడం ఆసక్తిగా మారింది.

**భారత్‌కు తెలుసనుకుంటున్న:**
భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ రష్యా తన భాగస్వామ్య దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను గౌరవిస్తుందని ఈ సందర్భంగా సెర్గీ లవ్రోవ్ అన్నారు. ఇదే క్రమంలో అమెరికా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంధన మార్గాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గ్లోబల్ ఎనర్జీ కారిడార్ పై ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా రష్యాతో ఇంధన సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై ఒత్తిడి తీసుకువస్తోందని ధ్వజమెత్తారు. ముఖ్యమైన అన్ని ఇంధన మార్గాలను స్వాధీనం చేసుకోవడమే అమెరికా లక్ష్యం అని.. ప్రస్తుతం ఏం జరుగుతుందో భారత్ కు అవగాహన ఉందని నమ్ముతున్నానన్నారు. రష్యా ఇంధన సరఫరాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్న పాశ్చాత్య దేశాలను ముఖ్యంగా యూరప్ కంట్రీస్ ను ఆయన విమర్శఇంచారు.

# వడ్ల కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ ఉమా హారతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, నారాయణఖేడ్ :**
నారాయణఖేడ్ మండలం నరసాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని డిఎన్టి తండాలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న వడ్ల కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, నిల్వలు తదితర అంశాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వడ్ల విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకోగా, లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన వడ్లను రైస్ మిల్లులకు తరలించడంలో ఆలస్యం జరుగుతోందని రైతులు, ఐకెపి సిబ్బంది తెలిపారు. లారీలను సక్రమంగా అందుబాటులో ఉంచితే రైతులు తీసుకొచ్చిన వడ్లను వెంటనే మిల్లులకు తరలించే అవకాశం ఉంటుందని వారు వివరించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ ఉమా హారతి, లారీల కొరత సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వడ్ల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రస్తుతం కేంద్రంలో వడ్ల కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని రైతులు ఖేడ్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

# స్వయం ఉపాధితో మహిళలు ఆత్మవిశ్వాసంగా ఎదగాలి : ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, నారాయణఖేడ్ :**
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని బాలసదనంలో 'మిషన్ శక్తి - బేటీ బచావో బేటీ పడావో' పథకం కింద నిర్వహించిన వొకేషనల్ టైలరింగ్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు వేడుకలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న బాలికలకు సర్టిఫికెట్లను పంపిణీ చేసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని, బాలికలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టైలరింగ్ వంటి వృత్తి నైపుణ్యాలు భవిష్యత్తులో బాలికలకు ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' స్ఫూర్తితో బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా మహిళలు, యువతుల కోసం ఇలాంటి మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బాలసదన నిర్వాహకులు, మున్సిపల్ అధికారులు, శిక్షణ సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# కగజ్‌నగర్ బస్టాండ్‌లో విషాదం..

## బస్సుల మధ్య ఇరుక్కొని చిన్నారి మృతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కగజ్ నగర్ మండలంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కౌడే భీంరావు కుమారుడు తరుణ్ (1/5)బస్సుల మధ్య ఇరుక్కొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులతో కలిసి కాగజ్‌నగర్ వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న సమయంలో ఉట్నూర్ డిపోకు చెందిన మరో ఆర్టీసీ బస్సు రివర్స్ తీసుకోవడంతో బాలుడు రెండు బస్సుల మధ్య ఇరుక్కొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బాలుడిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు పంపించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఘటనతో బస్టాండ్‌లో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పాలీసెట్-2026 పరీక్ష



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, సంగారెడ్డి ప్రతినిధి :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్-2026 ప్రవేశ పరీక్ష సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకీ దేవి తెలిపారు. బుధవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు సంగారెడ్డి పట్టణం మరియు జోగిపేట్‌లో ఏర్పాటు చేసిన మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 2,068 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 1,897 మంది పరీక్ష రాశారని, 171 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని తెలిపారు.

# బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్..

## భారీ ఆయుధాల డంప్ స్వాధీనం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, సెంట్రల్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్ లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ సత్ఫలితాలను ఇస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ పరిధిలో మావోయిస్టులు అత్యంత రహస్యంగా భూమిలో పాతిపెట్టిన భారీ ఆయుధాల డంప్‌ను పోలీసులు, భద్రతా బలగాలు గుర్తించాయి. ఈ ఆపరేషన్‌లో మావోయిస్టులకు చెందిన భారీ సంపద బయటపడింది. 32 అత్యాధునిక ఆయుధాలు.. అందులో ఏకే-47, ఇన్సాస్ వంటి హై-టెక్ రైఫిళ్లతో పాటు ఇతర యుద్ధ సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అదేవిధంగా సుమారు రూ.65.5 లక్షల లిక్విడ్ క్యాష్‌ను కూడా సీజ్ చేశారు. ఈ నగదును విరాళాలు, అక్రమ వసూళ్ల ద్వారా పోగు చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

**ముమ్మరంగా కూంబింగ్..**

గత కొద్ది రోజులుగా బీజాపూర్ అడవుల్లో భద్రతా బలగాలు జరుపుతున్న ముమ్మర గాలింపు చర్యల్లో ఈ భారీ ఆయుధాల డంప్ వెలుగుచూసింది. ఈ పరిణామంతో మావోయిస్టుల నెట్‌వర్క్‌ను తీవ్రంగా దెబ్బతీస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లా పరిధిలోని అడవుల్లో భద్రతా బలగాలు, పోలీసుల జాయింట్ కూబింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతూనే ఉంది.

# నీట్ యూజీ స్కాంపై కేంద్ర ప్రభుత్వంపై సుగుణ విమర్శలు

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని ఆరోపణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** నీట్-యూజీ 2026 పరీక్షలో వెలుగులోకి వస్తున్న పేపర్ లీక్, అవినీతి ఆరోపణలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కుమురంభీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో కేంద్రం విఫలమైందని పేర్కొన్నారు.ప్రతి ఏడాది నీట్ పరీక్షల్లో పేపర్ లీకులు, మార్కుల వివాదాలు తలెత్తుతున్నప్పటికీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. నీట్ విధానం వల్ల గ్రామీణ, పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీట్-యూజీ 2026 వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

# ట్రంప్- జిన్ పింగ్ భేటీ..

# ఇరాన్ యుద్ధానికి ఫుల్ స్టాప్..?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఇరాన్- అమెరికా యుద్ధం కారణంగా ఇరాన్ హార్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేసిన విషయం తెలిసిందే. దాంతో ప్రపంచ దేశాలు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లాయి. అటు అమెరికా, ఇరాన్ సైతం యుద్ధం కారణంగా బాగా నష్ట పోయాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. చైనా పర్యటన చేపట్టారు. తాజాగా ట్రంప్.. చైనా చేరుకున్నారు. వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, తైవాన్ కు ఆయుధాల విక్రయం వంటి అంశాలపై ట్రంప్.. జిన్ పింగ్ తో చర్చించనున్నారు.ప్రస్తుతం పశ్చిమాసియాలో ఇరాన్ కేంద్రంగా జరుగుతున్న ఉద్రిక్తతల్ని తగ్గించేందుకు చైనా తన ప్రభావాన్ని ఉపయోగించాలని ట్రంప్ కోరుతున్నారు. ముఖ్యంగా హార్మూజ్ జలసంధి గుండా చమురు రవాణా పునరుద్ధరణపై చర్చించనున్నారు. ఇక ఎలక్ట్రానిక్స్ అండ్ రక్షణ రంగాల్లో వాడే అరుదైన ఖనిజాల సరఫరాపై ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైనా వీటి ఎగుమతులపై విధిస్తున్న ఆంక్షల్ని సడలించే అవకాశం ఉంది.మరోవైపు అమెరికా వస్తువులపై చైనా విధిస్తున్న పన్నులు.. అలగే చైనా కంపెనీలపై అమెరికా ఆంక్షల విషయంలో ఇరు దేశాల మధ్య చర్చలు జరగనున్నాయి. ఇక ఈ పర్యటనకు ముందే అమెరికా కు చైనా కొన్ని హెచ్చరికలు జారీ చేసింది. తైవాన్ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకూడదని హెచ్చరించింది. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీ కండక్టర్ల తయారీలో పరస్పర సహకారం పైనా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇక దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత



అమెరికా అధ్యక్షుడు చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ సమావేశం రెండు దేశాలకే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యంత కీలకంగా చెప్పవచ్చు.

# ఆ విషయంలో పాకిస్థాన్ కంటే భారత్ 32 రెట్లు ఎక్కవ..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13 :** ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పౌరులందరికీ పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ముఖ్యంగా ఇరాన్ యుద్ధం కారణంగా భారత్ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ సూచన చేశారు. అయితే, పొరుగుదేశం పాకిస్తాన్ విదేశీ మారక నిల్వలు, భారత్ నిల్వలతో పోలిస్తే ఏ స్థాయిలో ఉన్నాయి?తాజా గణాంకాల ప్రకారం, పాకిస్తాన్ మొత్తం విదేశీ మారక నిల్వలు ఏప్రిల్ నెలాఖరుకు వి21.9 బిలియన్లుగా నమోదయ్యాయి. ఇది భారత్ వద్ద ఉన్న వి690.69 బిలియన్ల నిల్వలతో పోలిస్తే చాలా తక్కువ. గత ఫిబ్రవరిలో భారత్ నిల్వలు వి728.5 బిలియన్ల వద్ద చారిత్రక గరిష్ట స్థాయికి చేరాయి. అయితే, ముడిచమురు ధరల పెరుగుదల వల్ల అవి కాస్త తగ్గినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదికలు చెబుతున్నాయి.ప్రస్తుతం భారత్ విదేశీ మారక నిల్వలు పాకిస్తాన్ నిల్వల కంటే సుమారు 32 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఎగుమతులు, పెట్టుబడి ప్రవాహాలు, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వంలో రెండు దేశాల మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని ఇది స్పష్టం చేస్తుంది. పాకిస్తాన్ తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకోవడానికి రుణాలపై ఆధారపడాల్సి వస్తుండగా, భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో ఒకటిగా నిలుస్తోంది.పాకిస్తాన్ స్టేట్ బ్యాంక్ నివేదిక ప్రకారం, పాకిస్తాన్ మొత్తం వి21.29 బిలియన్ల నిల్వల్లో దాదాపు వి15.85 బిలియన్లు దేశ కేంద్ర బ్యాంకు వద్ద ఉన్నాయి. మిగిలిన వి5.44 బిలియన్లు దేశంలోని వాణిజ్య బ్యాంకుల వద్ద ఉన్నాయి. పాకిస్తాన్ నిల్వలు కేవలం 2.5 నెలల దిగుమతులకు మాత్రమే సరిపోతాయి. ఇది భారత్‌తో పోలిస్తే పాకిస్తాన్ ఆర్థిక బలహీనతను తేటతెల్లం చేస్తుంది.పాకిస్తాన్ దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థతో పోరాడుతూ, తన విదేశీ మారక నిల్వలను స్థిరీకరించేందుకు విదేశీ రుణాలు, సహాయ కార్యక్రమాలపై ఎక్కువగా ఆధారపడి ఉంది. ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి, బాహ్య చెల్లింపు బాధ్యతలను నెరవేర్చడానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి మరియు ఇతర బహుళపక్ష సంస్థల నుండి తరచుగా బెయిలౌట్ ప్యాకేజీలను కోరుతుంది.తాజా గణాంకాల ప్రకారం.. భారతదేశ విదేశీ మారక నిల్వలు ప్రస్తుతం సుమారు వి690.69 బిలియన్లుగా ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితి, ముఖ్యంగా పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా ఈ సంఖ్య ఫిబ్రవరిలో ఉన్న వి728 బిలియన్ల నుండి తగ్గింది. ఐ ఎం ఎఫ్ అంచనా ప్రకారం, 2026 నాటికి భారత్ కరెంటు ఖాతా లోటు వి84.5 బిలియన్లకు, లేదా జిడిపిలో సుమారు 2 శాతానికి పెరిగే అవకాశం ఉంది. డాలర్ ప్రవాహం కంటే బయటికి వెళ్లే డాలర్ల సంఖ్య అధికంగా ఉండి, విదేశీ నిల్వలు మరింత క్షీణించవచ్చని దీని అర్థం.



# కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం.. హిజాబ్ ధరించేందుకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, సెంట్రల్ డెస్క్:** 2022 లో కర్ణాటకలో ప్రారంభమైన హిజాబ్ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 2022 లో అప్పటి బీజేపీ ప్రభుత్వం.. పాఠశాలల్లో, కళాశాలల్లో హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సిద్ధ రామయ్య ప్రభుత్వం అధికారికంగా ఉపసంహరించుకుంది. ఈ మేరకు 2022లో జారీ చేసిన పాఠశాల యూనిఫాం నిబంధనలను కొట్టివేసింది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని పాఠశాలల్లో హిజాబ్ తో పాటు జంధ్యాలు ధరించేందుకు విద్యార్థులకు అనుమతి లభించింది. సిద్ధరామయ్య ప్రభుత్వం పాత ఉత్తర్వులను రద్దు చేస్తూ.. విద్యార్థులు తమ యూనిఫామ్ తో పాటుగా పరిమిత సంప్రదాయ అలాగే ఆచార సంబంధిత చిహ్నాలను ధరించడానికి అనుమతిస్తూ కొత్త ఉత్తర్వులను జారీ చేసింది. అయితే పాఠశాలల్లో క్రమశిక్షణ, విద్యా వాతావరణానికి భంగం కలగకుండా ఉండాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. తాజాగా ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.ఇక 2023 లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడే ఈ నిషేధాన్ని ఎత్తి వేస్తామని ప్రకటన చేసింది. అయితే రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముడేళ్ల తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. 2022 ఫిబ్రవరిలో అప్పటి బీజేపీ ప్రభుత్వం విద్యాసంస్థల్లో హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ జీవో జారీ చేసింది. మార్చి 2022 న కర్ణాటక హైకోర్టు ఈ నిషేధాన్ని సమర్థించింది. ఇక అక్టోబర్ 2022 లో సుప్రీంకోర్టులో ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం హిజాబ్ వివాదంపై భిన్నమైన తీర్పులు ఇవ్వడంతో ఈ కేసు పెండింగ్ లో ఉంది.





# బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా, చెక్‌పోస్టుల నిర్వహణపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 13, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, గోవుల అక్రమ రవాణా నివారణ, ధాన్యం కొనుగోలు, ధాన్యం అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు పోలీస్ శాఖ ఇతర శాఖలతో పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో పశువుల అక్రమ రవాణా నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా 9 చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. చెక్‌పోస్టు సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తూ.., జిల్లాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జిల్లా మీదుగా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా అధికారులు, సిబ్బంది 24ి7 అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.బక్రీద్ సందర్భంగా ఎలాంటి పశువుల అక్రమ రవాణా జరగడానికి వీలులేదని, అదే విధంగా బక్రీద్ సందర్భంగా వ్యర్థాలను నిర్ణీత ప్రదేశాల్లోని గుంతల్లో మాత్రమే వేయాలని, పరిశుభ్రతకు భంగం కలగకుండా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా ఏర్పాట్లకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అవసరాన్ని బట్టి రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని ఇతర కారణాలచేత తెలంగాణ రాష్ట్రంలో విక్రయించకుండా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ తెలియజేశారు.పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలు, రైతుల ప్రయోజనాలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.



# తెలంగాణ స్టైల్లో "పచ్చి పులుసు"

సమ్మర్‌లో అన్నం తినాలంటే కాస్త కష్టంగా ఉంటుంది. ఎండ వేడికి ఏమీ తినబుద్ధి కాదు. కూరతోపాటు కాస్త చారు లాంటిది ఉంటే అంతో ఇంతో తింటుంటారు. ఈ క్రమంలోనే తొందరగా, రుచికరంగా చేసుకునేలా ఉంటుందని మెజార్టీ పీపుల్ పచ్చి పులుసు చేసుకుని తింటుంటారు. అయితే ఈ రెసిపీని కూడా చాలా మంది రకరకాలుగా చేసుకుంటుంటారు. అయితే ఎప్పుడూ చేసేలా కాకుండా ఓసారి తెలంగాణ స్టైల్లో పచ్చిమిర్చి కాంబోలో చేసుకోండి. చాలా టేస్టీగా ఉంటుంది. తయారు చేసుకోవడం కూడా సులువే. మరి లేట్ చేయకుండా కమ్మని పచ్చిమిర్చి పచ్చి పులుసు ఎలా చేసుకోవాలో చూసేయండి.



కావాల్సిన పదార్థాలు:
పచ్చిమిర్చి - 3



వెల్లుల్లి రెబ్బలు - 6
కొత్తిమీర - గుప్పెడు
ఉప్పు - రుచికి సరిపడా
జీలకర్ర - పావు టీస్పూన్
చక్కెర - పావు టీస్పూన్
చింతపండు - పెద్ద నిమ్మకాయ సైజ్
ఉల్లిపాయ - 1
తాలింపు కోసం:
నూనె - 2 టేబుల్‌స్పూన్లు
ఆవాలు - అర టీస్పూన్
జీలకర్ర - 1 టేబుల్‌స్పూన్
ఎండుమిర్చి - 3
కరివేపాకు - 2 రెమ్మలు
పసుపు - అర టీస్పూన్

తయారీ విధానం:
ఓ గిన్నెలోకి చింతపండు తీసుకుని రెండు మూడు సార్లు శుభ్రంగా కడిగి సరిపడా నీళ్లు పోసి ఓ పదినిమిషాలు నానబెట్టాలి.

ఈలోపు ఉల్లిపాయ చివర్లు కట్ చేసి సన్నని ముక్కలుగా కట్ చేసుకోవాలి. అదే విధంగా పచ్చిమిర్చి తొడిమలు తీసేసి మిక్సీజార్‌లోకి వేసుకోవాలి.ఆపై అందులోకి పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలు, కొత్తిమీర, ఉప్పు, జీలకర్ర వేసి మరీ మెత్తగా కాకుండా కాస్త బరకగా గ్రైండ్ చేసుకోవాలి.చింతపండు నానినాక గట్టిగా పిండుతూ గుజ్జు సెపరేట్ చేసుకోవాలి. ఆ పులుపుకు సరిపడా వాటర్ పోసుకోవాలి.చింతపండు వాటర్ లోకి గ్రైండ్ చేసిన పచ్చిమిర్చి పేస్ట్, ఉల్లిపాయ ముక్కలు, చక్కెర వేసి అంతా కలిసేలా మిక్స్ చేసుకోవాలి.ఇప్పుడు తాలింపు కోసం స్టవ్ ఆన్ చేసి కడాయి పెట్టి నూనె పోసి వేడి చేసుకోవాలి.నూనె బాగా కాలినాక ఆవాలు, జీలకర్ర వేసి చిట్లనివ్వాలి. ఇవి చక్కగా వేగినాక ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి.ఇవి కూడా మంచిగా ఫ్రై అయ్యాక పసుపు వేసి కలిపి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.ఈ తాలింపు మిశ్రమాన్ని చింతపండు రసంలోకి వేసి కలుపుకుని సర్వ్ చేసుకుంటే సరి. ఎంతో టేస్టీగా ఉండే పచ్చిమిర్చి పచ్చిపులుసు రెడీ. నచ్చితే మీరూ ట్రై చేయండి.

చిట్కాలు:
పచ్చి పులుసు కోసం ఉపయోగించే చింతపండు మరీ పుల్లగా ఉండకుండా చూడాలి. అదే విధంగా చారు మరీ పల్చగా, వరీ మందంగా కాకుండా మీడియం థిక్‌నెస్‌తో ఉండేలా మిక్స్ చేసుకోవాలి. పచ్చి పులుసు టేస్టీగా ఉండాలంటే తాలింపులో జీలకర్ర, ఆవాలు వేగడం ముఖ్యం. కాబట్టి నూనె మంచిగా కాగిన



తర్వాత మాత్రమే వీటిని వేస్తే పర్ఫెక్ట్‌గా ఫ్రై అవుతాయి.



## చక్కెర, క్రీమ్, మిల్క్ పౌడర్ లేకుండానే టేస్టీ "కుల్ఫీ"

# ప్రిపరేషన్ చాలా సింపుల్!



మండే ఎండల్లో కుల్ఫీ తింటే ఆ కిక్కే వేరు. అందుకే సమ్మర్ వచ్చిందంటే పిల్లలు, పెద్దలు ఇద్దరూ ఇష్టంగా తింటుంటారు. అయితే, ప్రస్తుత రోజుల్లో ఐస్‌క్రీమ్ లేదా కుల్ఫీ ఏదైనా ఇంట్లో చేసుకోవడమే మంచిది. అందుకే మీకోసం అద్దిరిపోయే కుల్ఫీ రెసిపీ తీసుకొచ్చాం. సాధారణంగా కుల్ఫీ చేయాలంటే చక్కెర, క్రీమ్, మిల్క్‌పౌడర్ లాంటి పదార్థాలు కావాలి. కానీ ఇవేమి లేకుండా కేవలం చిలగడదుంపలతో కుల్ఫీ చేసుకోవచ్చు. టేస్ట్ అద్దిరిపోతుంది. పెద్దగా కష్టపడకుండానే చాలా సింపుల్‌గా చేసుకోవచ్చు. మరి, లేట్ చేయకుండా స్వీట్ పొటాటో కుల్ఫీని ఎలా ప్రిపేర్ చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు:**
చిలగడదుంపలు - 250 గ్రాములు
జీడిపప్పు పలుకులు - 15
బాదంపప్పు పలుకులు - 15
పాలు - అర లీటర్?
బెల్లం తురుము - 1/3 కప్పు
యాలకులు - 4
సన్నగా కట్ చేసిన డ్రై ఫ్రూట్స్ పలుకులు - కొద్దిగా

**తయారీ విధానం:**
స్టవ్ ఆన్ చేసి గిన్నె పెట్టి చిక్కటి పాలు పోసి మరిగించాలి. పాలు చక్కగా బాయిల్ అయినాక స్టవ్ ఆఫ్ చేసి పూర్తిగా చల్లారనివ్వాలి. చల్లారిన పాలను ఫ్రిజ్‌లో ఓ అరగంట పాటు ఉంచాలి. మరో గిన్నెలో బాదం పప్పులు, జీడిపప్పులు వేసి బాగా మరిగే నీటిని పోసి అరగంట సేపు నానబెట్టాలి.ఈలోపు చిలగడదుంపలను నీటిలో ఓ 10 నిమిషాలు నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల వాటికి ఉండే మట్టి పోతుంది. అవి నానిన తర్వాత ఒకటికి రెండు సార్లు శుభ్రంగా కడిగి ఆవిరి మీద మెత్తగా ఉడికించాలి.బాదం నానిన తర్వాత పొట్టు తీసి పక్కన ఉంచాలి. ఉడికించిన చిలగడదుంపల పొట్టు తీసేసి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి.ఇలా అన్ని పదార్థాలు రెడీగా ఉన్న తర్వాత మిక్సీజార్‌లో స్వీట్ పొటాటో ముక్కలు, నానబెట్టి పొట్టు తీసిన బాదం, జీడిపప్పులు, యాలకులు, కొన్ని పాలు పోసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.పాలను ఒకేసారి మొత్తం పోయకుండా ఒక కప్పు పాలను కొద్దికొద్దిగా పోసుకుంటూ గ్రైండ్ చేసుకోవాలి.ఇలా మెత్తగా మిక్సీ పట్టుకున్న తర్వాత బెల్లం తురుము వేసుకోవాలి. ఇక్కడ బెల్లం తురుమును స్వీట్ పొటాటో తీపిని బట్టి వేసుకోవాలి. ముందే ఎక్కువ మొత్తంలో వేసుకోకుండా గ్రైండ్ చేసిన తర్వాత టేస్ట్ చూసి సరిపోకపోతే మరికొంచెం వేసుకోవచ్చు.మొత్తం మిశ్రమాన్ని మెత్తగా గ్రైండ్ చేసుకుంటే కుల్ఫీ మిక్స్ రెడీ అయినట్లే. ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న మట్టి పాత్రలు లేదా బౌల్స్ లేదా గ్లాసులలో పోసుకోవాలి.ఆపై డ్రైఫ్రూట్స్‌తో గార్నిష్ చేసి మూత పెట్టి ఫ్రీజర్‌లో 6 గంటలు లేదా వీలైతే రాత్రంతా ఉంచాలి. ఆ తర్వాత వీటిని తీసి సర్వ్ చేసుకుంటే సూపర్ టేస్టీ అండ్ హెల్దీ స్వీట్ పొటాటో కుల్ఫీ రెడీ. నచ్చితే మీరూ ట్రై చేయండి.

**చిట్కాలు :**
కుల్ఫీ మరింత రుచికరంగా ఉండటానికి కుంకుమపువ్వు లేదా రోజ్ వాటర్ వంటివి యాడ్ చేసుకోవచ్చు.స్వీట్ పొటాటో కుల్ఫీ మరింత రుచిగా ఉండాలంటే, పాలతో పాటు కొద్దిగా పాల పొడి లేదా కండెన్స్‌డ్ మిల్క్ వేసుకోవచ్చు.కుల్ఫీ మిశ్రమాన్ని చిన్న మట్టి కుండలలో పోసుకుని ఫ్రీజర్ పెట్టుకుంటే టేస్ట్ చాలా బాగుంటుంది. అయితే, మట్టి కుండలు వాడితే ముందుగా వాటిని కడిగి ఓ గంట సేపు నీటిలో నానబెట్టి ఆ తర్వాత యూజ్? చేయాలి. అప్పుడే మట్టి వాసన రాకుండా ఉంటుంది.

# అద్దిరిపోయే "చికెన్-గోంగూర బిర్యానీ"



బిర్యానీ అనగానే అందరికీ గుర్తొచ్చేది మసాలాల ఘుమఘుమలే. మెత్తని మటన్, చికెన్ పీసులు మనసును ఊరిస్తాయి. అయితే, ఈ సారి డిఫరెంట్‌గా పుల్లపుల్లగా, కారంకారంగా ఉండే సరికొత్త బిర్యానీ రెసిపీని ట్రై చేయండి. అదే గోంగూర బిర్యానీ. పులుపును ఇష్టపడే ఫుడ్ లవర్స్ కి ఇది సూపర్ ఆప్షన్. బాస్మతీ బియ్యం, గోంగూర మిశ్రమంతో కలిపి ప్రిపేర్ చేసే ఈ వంటకం విందు భోజనాన్ని తలపిస్తుందంటే నమ్మండి! మరి, ఈ రుచికరమైన బిర్యానీ ఇంట్లోనే ఎలా ప్రిపేర్ చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

కావలసిన పదార్థాలు :
బాస్మతి బియ్యం - 2 కప్పులు
గోంగూర ఆకులు - 2 కప్పులు
చికెన్ - అరకేజీ
ఉల్లిపాయలు - పెద్దవి 2
పచ్చిమిర్చి - నాలుగైదు
అల్లం వెల్లుల్లి పేస్టు - 1 టేబుల్ స్పూన్
లవంగాలు - ఐదారు
యాలకులు - ఐదారు
దాల్చినచెక్క - 3 ఇంచులు
బిర్యానీ ఆకు - ఒకటి
నెయ్యి - 2 స్పూన్లు
కారం - తగినంత
పసుపు - ఒక స్పూన్
ఉప్పు - రుచికి తగినంత
పుదీనా - ఒక కట్ట
కొత్తిమీర - ఒక కట్ట

తయారీ విధానం :
ముందుగా బాస్మతి రైస్ శుభ్రం చేసుకొని అరగంట పాటు నానబెట్టుకోవాలి.ఆ తర్వాత ఉల్లిపాయలను నిలువుగా కట్ చేసి పెట్టుకోవాలి.ముందుగా ఒక బాణాలిలో కొద్దిగా నూనె వేసి, పచ్చిమిర్చి, గోంగూర ఆకులను ఫ్రై చేయాలి.ఆకులు మగ్గిన తర్వాత వాటిని చల్లార్చి, మెత్తని పేస్టులా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి.ఇప్పుడు మరో గిన్నెలో రైస్ కోసం ఎసరు సిద్ధం చేయాలి. తగినన్ని నీళ్లు పోసి బిర్యానీ దినుసులు, కొద్దిగా ఉప్పు వేసి మరిగించాలి.మరిగిన తర్వాత అందులో నానబెట్టిన బియ్యం వేసి 70 % వరకు ఉడికించుకోవాలి.రైస్ ఉడికేలోగా చికెన్ ప్రిపేర్ చేసుకోవాలి. మరో స్టౌ మీద అడుగు మందంగా ఉన్న పాత్రలో నూనె, నెయ్యి వేసి వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలు వేసి ఫ్రై చేయాలి.ఆనియన్స్ గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి వచ్చాక అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేదాకా ఫ్రై చేసుకోవాలిఇప్పుడు చికెన్ వేసి, ఐదారు నిమిషాలు మగ్గించుకోవాలి.తర్వాత పసుపు, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. మరికాసేపు ఉడికించుకోవాలి.ముక్కలు సగం ఉడికిన తర్వాత, పక్కన పెట్టుకున్న గోంగూర పేస్ట్ వేసి బాగా కలపాలి.నూనె పైకి తేలేంత వరకు ఉడికించాలి. దీనివల్ల గోంగూర పులుపు చికెన్ ముక్కలకు బాగా పడుతుంది.ఈ లోగా అన్నం 70 శాతం ఉడికిపోతుంది. ఇప్పుడు ఈ మిశ్రమం పైన ఉడికించిన అన్నం ఒక పొర మాదిరిగా వేసుకోవాలి.పైన కొత్తిమీర, పుదీనా, ఫ్రై చేసుకున్న ఉల్లిపాయలు , కొద్దిగా నెయ్యి చల్లుకోవాలి.తర్వాత మూత పెట్టి ఆవిరి బయటకు పోకుండా 10 నుంచి 15 నిమిషాల పాటు చిన్న మంట మీద దమ్ చేయాలి..అంతే, అద్దిరిపోయే గోంగూర బిర్యానీ సిద్ధమైపోతుంది. మీకు నచ్చితే తప్పకుండా ట్రై చేయండి.

చిట్కాలు:
గోంగూర మరీ పుల్లగా ఉంటే, కాస్త తగ్గడానికి కొద్దిగా ధనియాల పొడి చల్లుకోవచ్చు. లేదంటే గరం మసాలా మోతాదు పెంచండి. బిర్యానీకి ఎర్ర గోంగూర వాడితే మరింత రుచికరంగా ఉంటుంది.ఈ గోంగూర బిర్యానీని ఉల్లిపాయ పెరుగు పచ్చడితో తిన్నారంటే అదుర్స్ అనిపిస్తుంది.

## పావుగంటలో రెడీ- సూపర్ టేస్టీగా ఉంటాయి!


# బ్రెడ్‌తో క్రిస్పీ క్రిస్పీ "కట్‌లెట్స్"

ప్రతి ఒక్కరి ఇంట్లో బ్రెడ్ కచ్చితంగా ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్ ఏంలేనప్పుడు చాలా మంది టీ లేదా పాలలో బ్రెడ్‌ను ముంచుకుని తింటుంటారు. అయితే బ్రెడ్‌ను ఇలా కాకుండా అద్దిరిపోయే స్నాక్ రూపంలో ప్రిపేర్ చేసుకుని తినొచ్చు. అదే బ్రెడ్ కట్‌లెట్స్. తక్కువ పదార్థాలతో అతి తక్కువ సమయంలో తయారు చేసుకునే వీటి రుచి అద్భుతంగా ఉంటుంది. ఈవెనింగ్ టైమ్‌లో పిల్లలకు చేసి పెడితే చాలా అంటే చాలా ఇష్టంగా తింటారు. అంతేకాదు మళ్లీ మళ్లీ చేయమని అడుగుతుంటారు కూడా. మరి లేట్ చేయకుండా క్రిస్పీ బ్రెడ్ కట్‌లెట్స్ ఎలా చేసుకోవాలో చూసేయండి.

**కావాల్సిన పదార్థాలు:**
బ్రెడ్ స్లైస్‌లు - 8
ఆలుగడ్డలు - 2
ఉల్లిపాయ - 1
పచ్చిమిర్చి - 2
పసుపు - పావు టీస్పూన్
కారం - 1 టీస్పూన్
ధనియాల పొడి - 1 టేబుల్‌స్పూన్
గరం మసాలా - అర టీస్పూన్
ఉప్పు - రుచికి సరిపడా
బ్రెడ్ క్రంబ్స్- తగినంత

**తయారీ విధానం:**
బంగాళాదుంపలను శుభ్రంగా కడిగి సగానికి కట్ చేసి మెత్తగా ఉడికించి రెడీగా ఉంచాలి.చల్లారిన తర్వాత ఆలుగడ్డ ముక్కలపై పొట్టు తీసేసి సన్నగా తురుముకోవాలి. అదే విధంగా ఉల్లిపాయ, పచ్చిమిర్చిలను సన్నగా కట్ చేసుకోవాలి.ముందుగా ఒక బ్రెడ్ స్లైస్‌ను తీసుకుని నీటిలో రెండు వైపులా డిప్ చేసి నీళ్లు లేకుండా గట్టిగా పిండి ఒక్క గిన్నెలోకి తీసుకోవాలి.ఇలానే మిగిలిన బ్రెడ్ స్లైస్‌లను కూడా వాటర్‌లో ముంచి గట్టిగా ప్రెస్ చేసి తీసుకోవాలి.ఇలా అన్నింటిని నీటిలో తడుపుకున్నాక పొడిపొడిగా చేసుకోవాలి. బ్రెడ్ మిశ్రమంలోకి ఆలూ తురుము, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు వేసి అంతా కలిసేలా మిక్స్ చేసుకోవాలి.పిండిని ఈ విధంగా మిక్స్ చేసుకున్నాక కొద్దికొద్దిగా తీసుకుంటూ కట్‌లెట్స్ మాదిరి చేసుకోవాలి.ఇలా చేసుకున్న కట్‌లెట్స్‌ను బ్రెడ్ క్రంబ్స్‌లో డిప్ చేసి ప్లేట్‌లోకి తీసుకోవాలి.స్టవ్ ఆన్ చేసి కడాయి పెట్టి షాలో ఫ్రైకి సరిపడా నూనె పోసి వేడి చేసుకోవాలి.కాగిన నూనెలో కట్‌లెట్స్ వేసి మీడియం ఫ్లేమ్‌లో ఫ్రై చేసుకోవాలి. కట్‌లెట్స్ ఓ వైపు వేగినాక మరో వైపుకు తిప్పుకుని వేయించాలి.ఇలా రెండు వైపులా క్రిస్పీగా, గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించి ప్లేట్‌లోకి తీసుకోవాలి. మిగిలిన వాటిని కూడా వేయించి వేడివేడిగా తింటే సరి. ఎంతో టేస్టీగా ఉండే బ్రెడ్ కట్‌లెట్స్ రెడీ. నచ్చితే మీరూ ట్రై చేయండి.

**చిట్కాలు:**
బ్రెడ్ క్రంబ్స్ అన్ని సూపర్ మార్కెట్స్‌లో దొరుకుతాయి. మీ దగ్గర అందుబాటులో లేకపోతే నార్మల్ బ్రెడ్ తీసుకుని దానిని మిక్సీలో వేసి ఒకసారి తిప్పి, ఆ పొడిని పెనంపై దోరగా వేయిస్తే సరిపోతుంది.షాలో ఫ్రై కాకుండా నార్మల్‌గా ఆయిల్‌లో డీప్‌ఫ్రై కూడా చేసుకోవచ్చు. మీకు నచ్చిన పద్ధతిలో చేసుకోవచ్చు.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-